విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఈనెల 26 తేదీ నుండి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని అందరూ సమన్వయంతో ఒక పండుగ వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్,జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమర్ధవంతంగా నిర్వహించేందుకు దిశ నిర్దేశం చేసారు. ఏపీ వ్యాప్తంగా ఈనెల 26వ తేదీ మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. గుంటూరు జిల్లా నల్లపాడు లయోలా పబ్లిక్ స్కూల్‌లో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉదయం గం. 9.30లకు ఆడుదాం ఆంధ్రా' ,ప్రారంభ కార్యక్రమం నిర్వాణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, గతంలో ఎన్నడూ జరగని విధంగా పెద్ద ఎత్తున 5 స్థాయిల్లో జరుగుతోందని, ఇందులో ఆసక్తిగల క్రీడాకారులను, ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి ప్రధాన క్రీడలు గ్రామ, వార్డు సచివాలయం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరగనున్నాయన్నారు.ఈనెల 26వ తేదీన మంగళవారం నుండి 605 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు సజావుగా నిర్వహించాలన్నారు. క్రీడా సంబరాల్లో పాల్గొనేందుకు 1,47,000 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలోని గ్రామ సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడా పోటీల నిర్వహణ కోసం 320 ఆట స్థలాలను సిద్ధం చేసినట్టు తెలిపారు.

జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు అధికప్రాధాన్యమిస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియ చేస్తున్నదని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి 5.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రాథమిక అంచనాగా ఉందన్నారు. 251 ఆర్‌బీకేలు ద్వారా ఇప్పటివరకు 46,799 మంది రైతుల నుంచి రూ.495.84 కోట్లు విలువైన 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ధాన్యం విక్రయించిన తర్వాత సొమ్ములు చెల్లించేందుకు నిర్ణీత గడువు 21 రోజులు కాగా కేవలం మూడునాలుగు రోజుల్లోనే రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించడం జరుగుతోందన్నారు.ఇప్పటి వరకు 34,041 మంది రైతుల ఖాతాలకు 367.08 కోట్లు జమయ్యాయని తెలిపారు. ఈ రెండు మూడు రోజుల్లో సేకరించిన 9,699 మంది రైతులకు సంబంధించి రూ.111.60 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే వారి ఖాతాలకు ధాన్యం సొమ్ములు జమవుతాయని వివరించారు. మిగిలిన రైతుల నుంచి త్వరితగతిన ధాన్యం సేకరణకు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జనవరి 3 నుంచి 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు శ్రీత్యాగరాజ మ్యూజిక్ అకాడమీ (త్యాగరాజ భక్త సభ) అధ్వర్యంలో 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, త్యాగరాజ స్వామి వారి 176వ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, కారుమూరి ఆదిత్య తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో బ్రోచర్ ను విడుదల చేసి మాట్లాడారు. జనవరి 3 నుంచి 6 తేదీ వరకు సాయంత్రం 6.30 గంటల నుంచి ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం, 7,8 తేదీల్లో ఏఎస్ఆర్ లోని అల్లూరి సీతారామరాజు సంస్కృతిక కేంద్రంలో 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్, సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడుతూ 3న ఉదయం 8.30 గంటలకు స్వామివారి ఊరేగింపు, సాయంత్రం 6.30 నిమిషాలకు సురేంద్రనాథ్ అండ్ పార్టీ 24 మంది బృందంతో నృత్యం, 4న జె యోగవందనచే వీణ కచేరి, 5న లతాంగి సిస్టర్స్ చే గాత్రం, 6న ఉదయం 10 గంటలకు శ్రీత్యాగరాజ స్వామివారి పంచరత్న కీర్తనలు, సాయంత్రం 6.30 గంటలకు బెంగళూరు బ్రదర్స్ వారిచే గాత్రం, 7న జంధ్యాల కృష్ణకుమారి బృందంచే హరికథ, 8న పోఫూరి గౌరినాథ్ బృందం వారిచే పాహిరామ ప్రభో సంగీత రూపకం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ పాల్గొని ఈ 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పబిలిశెట్టి వెంకటేశ్వర రావు, కారుమూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-అత్తిలి: సీపీఐ 99 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తణుకు ఏరియాలో వాడవాడలా పార్టీ పతాకాన్ని ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు సీపీఐ తణుకు ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు అత్తిలి లో సోమవారం సీపీఐ శాఖ సమావేశం జక్కుల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమం లో అనేక మంది కమ్యూనిస్టు నాయకులు అసువులు బాసిన ఘన చరిత్ర గల పార్టీ సీపీఐ అన్నారు. లక్షలాది ఎకరాలు పేద ప్రజకు పంచిందని, ప్రజల పక్షాన నిరంతరం పోరాడే పార్టీ సీపీఐ అని అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో హామీలు అమలు చేయాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని వివిధ దశలలో పోరాటాలు నిర్వహిస్తున్నది సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమం లో మంగం పెంటయ్య , కొల్లి సూర్యరావు, వి. శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున ఉద్యమాలు

- భూ హక్కు చట్టం రద్దుకు న్యాయవాదుల నిరసనలు
- 13వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఎటు చూసినా నిరసనలు, ఆందోళనలు, సమ్మెలు. ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పరిస్థితి ఇది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి చలో కమిషనరేట్, చలో కలెక్టరేట్, వంటి కార్యక్రమాలతో ఆందోళనలు కొనసాగిస్తున్నా దున్నపోతు మీద వాన కురిసినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. వాటి పర్యవసానమే నేటి ఆందోళనలు.ఒకవైపు అంగన్వాడీలు, మరోవైపు న్యాయవాదులు, ఆశ వర్కర్లు, ప్రస్తుతం జగన్ సర్కారుపై ధ్వజమెత్తుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఒక్కొక్కరుగా రోడ్డెక్కుతున్నారు.13 రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మెబాట పట్టారు. వారు సమ్మెబాట పట్టడంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ఆశ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ నాడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోగా సమ్మె చేస్తున్న వారిపై ప్రభుత్వం అణచివేత చర్యలకు దిగుతున్నారు. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు అన్ని రకాల పద్ధతులను అనుసరిస్తున్నది. అంగన్వాడి కేంద్రాలు తెరిపించి సమ్మె ప్రభావం ఏమీ లేదని చెప్పేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో బల వంతంగా అంగన్వాడీ కేంద్రాలు తెరిపించి బెదిరింపులకు పాల్పడినా అంగన్వాడీలు వెనక్కి తగ్గడం లేదు. చాలా చోట్ల అంగన్వాడీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదంటూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

భూ హక్కు చట్టం రద్దుకు న్యాయవాదుల డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన ప్రజల ఆస్తులకు భద్రత లేని భూహక్కు చట్టం రద్దు చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో న్యాయ వాదుల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల కాలంలో ప్రజల ఆస్తులకు భద్రత లేని భూ హక్కుల చట్టం తీసుకువచ్చి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే పేరుతో న్యాయస్థానం సివిల్ కోర్టు పరిధి కేసులు అన్నిటిని ట్రిబ్యునల్ పేరు మీద జిల్లా స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి సివిల్ కేసులన్ని ట్రిబ్యునల్ లో వేసుకొని కేసు వేసిన వ్యక్తికి అభ్యంతరాలు ఉంటే హైకోర్టుకి అపిల్ పోయే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం తీసుకురావడం జరిగింది. ఈ చట్టం వలన సామాన్యుడికి నష్టం జరుగుతుంది. తక్షణమే ఈ చట్టం రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు.

ఆశా వర్కర్ల నిరసనలు

ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని నాలుగున్నర ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆందోళనకు సమాయత్తం అవుతున్నారు. బహిరంగ సభలలో ముఖ్యమంత్రి జగన్ నా అక్కా చెల్లెమ్మలు అని సంబోధిస్తూ సమ స్యలు మాత్రం పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చి మరి మాట తప్పారంటూ ఆశా వర్కర్లు, అంగన్వాడీలు సిబ్బంది ఆక్రోశిస్తు న్నారు. తమ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రిటైర్ అయిన తరువాత రూ.5 లక్షలు గ్రాట్యుటీ చెల్లిం చాలని డిమాండ్ చేస్తున్నారు. చనిపోయిన ఆశా వర్కర్ల కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధి సిబ్బంది వెతలు

గ్రామీణ అభివృద్ధి శాఖలో పనిచేసే సెర్ప్ సిబ్బందికి పి.ఆర్.సి అమలు చేయగా ఉపాధి హామీ పథకం సిబ్బందికి మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదు. ఉపాధి సిబ్బందికి రిటైర్మెంట్ వయో పరిమితి పెంచలేదు. మరోవైపు ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అన్ని శాఖలలో అరకొర జీతాలతో పనిచేస్తున్నారు. దీంతో లక్షల మంది సిబ్బంది లబోదిబోమంటున్నారు. ప్రభుత్వంపై గళం ఎత్తితే ఉద్యోగాలు పోతాయి అన్న భయంతో కొందరు ఉండగా మరికొందరు ఏదో రూపంలో నిరసనలు తెలియజేస్తున్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులు, కార్మికులు సమ్మె నోటీసులు ఇస్తే వాటిని పరిష్కరించి సమ్మెను నివారించే ప్రయత్నాలు చేయాల్సిన ముఖ్యమంత్రి జగన్ అహంకారపూరితంగా వ్యవహరించడం తన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఉద్యోగులు, కార్మికులపై ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రాబోవు ఎన్నికలలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇకనైనా కార్మికులు, ఉద్యోగులు సమస్యలను పరిష్కరించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఉద్యోగ, కార్మిక వర్గాల వారు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసు అధికారులు కోరారు. ఏలూరు, జంగారెడ్డి గూడెం, పోలవరం నూజివీడు సబ్ డివిజన్, కైకలూరు సర్కిల్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో విజిబుల్ పోలీసింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించారు. నేర నియంత్రణ కొరకు గంజాయి, మద్యం, నాటు సారాయి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించిన గుట్కా ఖైనీ ల అక్రమ రవాణా అరికట్టుట,రహదారి ప్రమాదాల నివారణకు అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో ఉన్న పోలీస్ అధికారులు విజిబుల్ పోలీసింగ్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడం వలన ప్రాణహాని ఉండదని ఏదైనా ప్రమాద సమయంలో మీకు ప్రాణరక్షణగా హెల్మెట్ ఉంటుందని గమనించాలన్నారు.వేగం వద్దు, ప్రాణం ముద్దు అని, వాహనాలు నడిపే సమయంలో మీపై కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారన్న విషయాన్ని గ్రహించి ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ సురక్షితముగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిశోధనలు చేయాలి

ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర -భీమవరం: అల్గారిథమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో పరిశోధనలు చేసే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం పెద్ద ఎత్తున నిధులు అందిస్తుందని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఐటి వరంగల్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ బి వి సుబ్రహ్మణ్యం అన్నారు. ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అల్గారిదమ్స్ ఇన్ అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై మూడు రోజులు పాటు జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులకు వచ్చిన పేపర్లను విద్యార్థులు ప్రాజెక్టులు స్వీకరించి వాటికి ఆచరణ రూపం తీసుకువస్తే ఎన్నో వినూత్న ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు. జేఎన్టీయూకే కాకినాడ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.హెచ్.ఎం.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో జాతీయ అంతర్జాతీయ సదస్సులు, పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అన్ని విభాగాలు కృషి చేయాలని తద్వారా విద్యార్థులకు ఫ్యాకల్టీ కి ఎంతగానో ఉపయోగ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళి కృష్ణంరాజు, ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ నగేష్ బట్టు డాక్టర్ కె.ఎస్.వి.జగన్మోహన్, డాక్టర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భూహక్కుల చట్టం రద్దుకై పోరాటం అవసరం

విశాలాంధ్ర-పాలకొల్లు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజల ఆస్తులకు భద్రత లేని 512 జీవో భూ హక్కుల చట్టం రద్దుకై ప్రజా పోరాటం అవసరమని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో భూ హక్కుల చట్టం రద్దు కోరుతూ నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మలకు, సంఘ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ చట్టం అమలుతో ప్రజలకు కలిగే నష్టాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ భూ హక్కుల చట్టం అమలు వలన తరతరాల నుంచి, ముత్తాతల నుంచి ఉన్న ఆస్తులపై ప్రజలు హక్కు కోల్పోడమే అన్నారు. ప్రజల ఆస్తులను ప్రభుత్వం తన చేతిలోకి లాక్కొని అమ్మకానికి, తాకట్టు పెడుతుందని విమర్శించారు. ట్రిబ్యునల్ కోర్టుల్లో రెవిన్యూ అధికారులే ఉంటారని, అందువల్ల ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటుందన్నారు. మన ఆస్తి ఉందో లేదో ఆన్లైన్లో ప్రతిరోజు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుం దని, రెండేళ్ల గడువు దాటితే కోర్టుకెళ్లే పరిస్థితి ఉండదని అన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-టి నరసాపురం : మండలంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రార్ధన మందిరాలు చర్చ్ లలో క్రైస్తవ విస్వాసులు క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, టి నరసాపురం, పుట్రేపు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, గండిగూడెం,కె జగ్గవరం, తెల్లం తదితర గ్రామాల్లో పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు కలిసి క్రీస్తు పుట్టిన రోజును సందర్భంగా కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆయా సంఘాలలో స్వీట్లు పంపిణీ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. వృద్దులు, వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలలో పాస్టర్లు వాక్యము బోధించారు. సమాజంలో శాంతిని స్థాపించడానికి యేసు క్రీస్తు ప్రభువు భూమి పై జన్మించారని ఆయన బోధనలు అనుసరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరు తోటి వారి పట్ల ప్రేమ కలిగి ఉండాలని సేవాభావం ఉండాలని బోధించారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు జి జ్ఞాన్ రాజు, కె. నిరీక్షణ రావు, సిహెచ్ హెూషేయ, సిహెచ్ రమేష్, టి. ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో : మండలం లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిలన్నీ పండగ కళను సంతరించుకున్నాయి. కలిదిండి, కోరుకొల్లు, సానా రుద్రవరం, కొండగి, తాడినాడ, పెద్దలంక పలు గ్రామాల్లో భక్తులంతా అర్ధరాత్రి నుంచే వేడుకల్లో పాల్గొన్నారు. సోమవారం స్థానిక ఆర్ సి ఎం చర్చి నందు ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అరుతెగలపాడు లోని హెూసన్న ప్రార్థన మందిరంలో జరుగుతున్న క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పాల్గొని ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నున్న. సోమయ్య, తోకల సింగరయ్య, దైవజనులు, సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

పోడూరులో : పోడూరు లోని నూతన ఎరూసలేం జూబ్లికల్ బాప్టిస్ట్ చర్చి వద్ద ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు, మహిళలు ఆలపిం చిన క్రీస్తు గీతాలతో వేడుకలు ప్రారంభం కాగా పాస్టర్లు రుద్రరాజు శ్రీనివాసరాజు, ఆర్ మోజెష్ దైవ సందేశం వినిపించారు. సర్వ శక్తి మంతుడైన యేసుక్రీస్తును ఆరాధించే వారికి వారి జీవితాలలో అంధకారం తొలగి యేసుక్రీస్తు అనుగ్రహం పొందుతారని పాస్టర్ శ్రీనివాసరాజు అన్నారు. ఈ సందర్భంగా జరిగిన చిన్నారుల నృత్యాలు, చిన్నారులు పలికిన దైవ వాక్యాలు విశ్వాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దైవ సందేశం అనంతరం పాస్టర్ మోజెస్ క్రిస్మస్ కేకును కట్ చేశారు. చర్చి పరిధి లోని సంఘ పెద్దలు సభ్యులు విశ్వాసులు పాల్గొన్నారు.

భీమడోలులో: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు ఆర్ సి ఎం చర్చిలో నిర్వహించిన ప్రార్ధనలో ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భీమడోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు ప్రత్తి మధన్, వెజ్జు రాంబాబు, తాటిమళ్ల రామ్మూర్తి, నీలం అజయ్, ముప్పిరిశెట్టి దుర్గరావు, భీమన దుర్గ పల్లవి, లక్కకుల శ్రీను,వెజ్జు సూరిబాబు, కె. శ్రీను,జి. బుజ్జి,కనుమూరి లీల కృష్ణ, వెజ్జు బాబు ఈతకోట మున్నా, చిట్టూరి సతీష్,అయితం ప్రసాద్,తానేటి జోగేశ్వరరావు, చిన్నం ఆనంద్, ముదునూరి ప్రసాద్, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెంలో : ఏసుక్రీస్తు పుట్టిన పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవ సోదరీ సోదరులు నూతన వస్త్రాలు ధరించి మందిరాలకు వెళ్లి క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని బోగోలు గ్రామంలో బెత్తస్థా ప్రార్థన మందిరంలో స్వర్ణ పాల్ ఫౌండేషన్ వారు, డేనియల్ పాల్ మినిస్ట్రీస్ వారు వృద్ధులకు, పేదవారికి నూతన వస్త్రాలు చలికాలంలో కప్పుకోవడానికి దుప్పట్లు అందజేశారు. అయ్యప్పరాజు గూడెంలో సాఫ్ట్వేర్ ఉద్యోగి సొంగ ఉదయ్ క్రీడా సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా దైవజనులు కొల్లపు విజయరాజు మాట్లాడుతూ యేసుక్రీస్తు లోకానికి శాంతి సహనం అలవర్చుకుని ఐక్యమత్యంతో మెలగాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీలైనంతవరకు తోటి వారికి సహాయం చేయాలని అన్నారు. యేసు క్రీస్తు తన బోధనలో మానవాళికి ప్రేమను పంచటం నేర్పించారని ఈ సందర్భంగా తెలిపారు. క్రిస్మస్ సంబరాల్లో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ ప్రార్థన వేడుకల్లో మత గురువులు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి : ఎస్‌టియు

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: అంగన్‌వాడీల న్యాయ సమ్మతమైన డిమాండ్లు పరిష్కరించాలని ఎస్‌టియు సీనియర్ నాయకులు తాడి నరసింహారావు, షేక్ అబ్దుల్ హక్‌లు డిమాండ్ చేశారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్స్ నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కార్యక్రమానికి ఎస్‌టియు సంఘీభావం తెలిపింది. ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ అంగన్వాడీ కార్యకర్తలకు, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం వారి న్యాయబద్ధమైన కోర్కెలు నెరవేర్చాలన్నారు. అంగన్వాడి కార్యకర్తల సమస్యల పట్ల ప్రభుత్వ నిరంకుశ విధానాలను విడనాడి వెంటనే వారితో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్థిక కార్యదర్శి కోలంటి వంశీ వశిష్ట, మండలంలోని వివిధ గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్స్ పాల్గొన్నారు. అనంతరం క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రార్థనలు చేశారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

విశాలాంధ్ర-మండవల్లి: కైకలూరు నియోజకవర్గ ప్రజలు క్రిస్మస్ వేడుకలు ఆనందంగా జరుపుకోవాలని మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, టిడిపి యువ నాయకుడు పెన్మేత్స వెంకటేశ్వరరాజు అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రార్థనా మందిరాలకు వచ్చే సంఘ విశ్వాసులకు 55 వేల కేకులు, లడ్డూలు మండలాల వారీగా వితరణ చేశారు. మండవల్లి స్టేషన్ రోడ్ లో గల చర్చిలో సోమవారం క్రిస్మస్ పండుగలు పురస్కరించుకొని యువ నాయకుడు పెన్మేత్స వెంకటేశ్వరరాజు, మండల అధ్యక్షులు పెన్మేత్స త్రినాథ్ రాజు,నారగాని వెంకట నాగేశ్వరరావు, నాయకులు క్రీస్తు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, రాబోయే ఎన్నికలలో టిడిపి విజయం సాధించి అధికారంలోకి రావాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.మండవల్లి మండలంలో టిడిపి నాయకులు నారగాని వెంకట నాగేశ్వర రావు(మండవల్లి మండల అధ్యక్షులు), పళ్లెం ఏడుకొండలు, ముళ్ళపూడి సత్తిబాబు, మారగాని మురళీకృష్ణ, కూనపరెడ్డి కోటేశ్వరరావు ద్వారా కేకులు, లడ్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు బాలలకు ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం ఉదయం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో నిర్వహించనున్నట్టు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఆదివారం భీమవరంలో ఆయన మీడియాకొక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ విజయవాడ ఆంధ్రా హాస్పిటల్ కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 ఏళ్ల లోపు పిల్లలను పరిశీలించి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య చికిత్సలు అందిస్తారని, వైద్యశిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దేవాలయాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం

విశాలాంధ్ర - గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకారం ఎంతైనా అవసరం అని ఉంగుటూరు నియోజవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు.గణపవరం మండలం ముగ్గుళ్ళ గ్రామంలో ముగ్గల్లమ్మ తల్లి గుడి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ జరిగిన అన్న ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో జనసేన నాయకులు దేవరపు లక్ష్మి నారాయణ, పెంటిబోయిన శ్రీనివాస్, లోకం జనార్ధన్, దేవరపు నరేష్, తిప్పిరిశెట్టి రాము, పంజా రమేష్, లోకం ఫణి, చినిమిల్లి నరేష్, బుత్తల మహంకాళి, లోకం వినయ్, కుంకుట్ల సుబ్బయ్య, గ్రామ జనసేన నాయకులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర-టి నరసాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మనసు మారి అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు సోమ వారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నిరసన తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మెలో క్రిస్మస్ ను పురస్కరించుకుని కేకు కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 14రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టక పోవడం బాధాకరం అన్నారు. వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

క్రిస్టియన్ మైనారిటీ జిల్లా సహాయ కార్యదర్శిగా నాగ బుజ్జి

విశాలాంధ్ర-పెంటపాడు: తాడేపల్లిగూడెం క్రీస్తు సంఘంసువార్తికులు బ్రదర్ రొక్కాల నాగ బుజ్జిని వైకాపా క్రిస్టియన్ మైనారిటీ పశ్చిమ గోదావరి జిల్లా సహాయ కార్యదర్శిగా నియ మించడం పై క్రీస్తు సంఘము సువార్తికులు హర్షం వ్యక్తం చేశారు. రొక్కాల నాగ బుజ్జి మాట్లాడుతూ క్రిస్టియన్ మైనారిటీ జిల్లా సహాయ కార్యదర్శి పదవి దేవుని మహా కృప బట్టి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌కి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. రొక్కాల నాగ బుజ్జి ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్‌గా, చర్చ్ ఆఫ్ క్రైస్ట్ క్రిస్టియన్ థియాలజీ కాలేజీ , నేషనల్ బైబిల్ ఎపిస్కోపల్ డయాసిస్ క్రిస్టియన్ థియలజీ కాలేజీలకు మేనేజింగ్ డైరెక్టర్ గా, పశ్చిమ గోదావరి జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్‌గా, తాడేపల్లిగూడెం క్రీస్తు సంఘం సువార్తికులుగాను, తాడేపల్లిగూడెం సీనియర్ జర్నలిస్టుగా పని చేస్తున్నారు.